సాక్షి
పెద్దపల్లి

ఆదివారం । 19 । మే । 2024



రాజన్నకు కోడెమొక్కులు

వేములవాడ: రాజన్నను శనివారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి కోడెమొక్కులు చెల్లించుకున్నారు.

రామ్‌లల్లా సందర్శన



రామగుండం: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు శనివారం ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య రామ్ లల్లాను దర్శించుకున్నారు. బాలరాముని ఎదుట ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
38.1/31.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వేగంగా ధాన్యం కొనుగోలు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం నిల్వలను ఆయన శనివారం పరిశీలించారు. రైతులు, నిర్వాహకులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తికావాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఏర్కొన్నారు. సివిల్ సప్లయి డీఎం శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రగతిపై సమీక్ష



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

మంథని: గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో భాగంగా మంచిర్యాల–వరంగల్ మధ్య మంథని డివిజన్ నుంచి తొలి ప్యాకేజీలో చేపట్టే జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ప్రగతిపై మంథని ఆర్డీవో హనుమా నాయక్ శనివారం సమీక్షించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్ అండ్ బీ, ఆర్‌డబ్ల్యూఎస్‌తోపాటు తహసీల్దార్లతో చర్చించారు. పెండింగ్ పనులపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మంథని, ముత్తారం, రామగిరి తహసీల్దార్లు రాజయ్య, రాంచందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


'విద్యానిధి'కి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థులు(విదేశాల్లో చదివేవారు) ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి జనార్దన్ శనివారం తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్‌స్థాయి పీహెచ్‌డీ, డాక్టోరల్ రీసెర్చ్ ప్రోగ్రాం చదవాలనుకునే గిరిజన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు కేంద్రప్రభుత్వం ఉపకారవేతనాలు అందిస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఎల్లంపల్లి'లోకి ఇన్‌ఫ్లో

రామగుండం: పలుచోట్ల కురుస్తున్న అకాలవర్షాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో స్వల్పంగా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 148 అడుగులు కాగా, నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు. శనివారం నీటిమట్టం 140.68 అడుగులకు చేరగా, నీటి నిల్వ సామర్థ్యం 5.69 టీఎంసీలుగా నమోదైందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ఎన్టీపీసీకి 242 క్యూసెక్కులు, హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు 329 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 523 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది.

మే పుష్పం.. ఎంతో అందం



రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాకు చెందిన ఇల్లందుల శ్రీనివాస్‌కు ఇంట్లో మే పుష్పం శనివారం వికసించింది. ఏటా మేలోనే పూసే పుష్పం.. చాలా అందంగా ఉండడంతో స్థానికులు వచ్చి సెల్ఫీలు తీసుకుంటున్నారు.

హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పెద్దపల్లిరూరల్: రాష్ట్రప్రభుత్వం హమాలీల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం డిమాండ్ చేశారు. హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు వర్తింపజేయాలన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే గూడ్స్‌షెడ్, రైస్‌మిల్లులు, గోదాములు, మార్కెట్ యార్డులు, ఐకేపీ సెంటర్లతోపాటు వివిధ ప్రాంతాల్లో పనిచేసే హమాలీలకు ఉద్యోగ భద్రత కరువైందన్నారు. బస్తాలు మోస్తూ అవస్థలు పడుతున్న కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గతంలో నిరక్షరాస్యులే హమాలీ పని చేసే వారని, ఇపుడు కుటుంబ పోషణ కోసం విద్యావంతులు సైతం హమాలీగా పని చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. పొరుగురాష్ట్రాల నుంచి వచ్చిన హమాలీలతో పోటీ పెరిగి, యజమానులు తక్కువ కూలీలకే పనులు చేయించుకుంటూ స్థానిక హమాలీలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన చెందారు.

లాభాలెన్ని.. వాటా ఎంత?

- ఇప్పటికీ స్పష్టత ఇవ్వని సింగరేణి యాజమాన్యం
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి
- పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత లాభాలు తేల్చే అవకాశం!

8 ఏళ్లలో సింగరేణి సాధించిన వాస్తవ లాభాలు

ఏడాది	లాభాలు	వాటా (శాతంలో)	చెల్లించింది (రూ. కోట్లలో)
2015-16	1,001.17	23	230.26
2016-17	395.38	25	98.84
2017-18	1,212.00	27	327.27
2018-19	1,766.00	28	493.00
2019-20	993.00	28	278.04
2020-21	272.20	29	79.06
2021-22	1,227.00	30	368.00
2022-23	2,222.00	32	711.00



గోదావరిఖని: గత ఆర్థిక సంవత్సరం ముగిసి సుమారు 47రోజులు గడిచింది. 2023–24లో నిర్దేశిత 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించింది. బొగ్గు ఉత్పత్తి గణాంకాలు పూర్తయ్యాయి. అయినా, ఆర్థిక గణాంకాలపై ఇంకా స్పష్టత రాలేదు. వార్షిక లాభాలతో కార్మికుల వాటా ముడిపడి ఉంది. దీంతో సంస్థ ఎన్ని లాభాలు ఆర్జించింది? అందులోని వాటాగా తమకు ఎంత వస్తుందనే ఆశతో సింగరేణి కార్మికులు ఎదురుచూస్తున్నారు.

ఏటా నిర్దేశిత లక్ష్యం సాధిస్తూ..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి బొగ్గుగనుల సంస్థ ఏటా నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తి సాధిస్తూ, ఆర్థిక నివేదికలు సమర్పిస్తూ వస్తోంది.
- ఈ క్రమంలోనే 2023–24 ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా.. 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది.
- వార్షిక టర్నోవర్ సుమారు రూ.37వేల కోట్ల మేర ఉంటుందని భావిస్తున్నారు.
- 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.33వేల టర్నోవర్ సాధించి రూ. 2,222 కోట్ల ఆదాయం ఆర్జించింది.
- అప్పటికన్నా ఈసారి బొగ్గు ఉత్పత్తితోపాటు టర్నోవర్ కూడా పెరిగింది.
- దీంతో సింగరేణికి లాభాలు కూడా అధికంగానే వచ్చాయని భావిస్తున్నారు.
- ఈక్రమంలో ఈసారి కార్మికులకు లాభాలు ఎక్కువగా వస్తాయని ఆశపడుతున్నారు.

ఖరారు చేసేది సీఎం..

సింగరేణి యాజమాన్యం ఏటా ఆర్జించే లాభాలను ప్రకటించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తుంది. అందులో కార్మికులకు లాభాల వాటా రాష్ట్ర ముఖ్యమంత్రి ఖరారు చేస్తారు. ఇదేవిషయంపై ప్రకటన చేయడం ఆనవాయితీ. ఈక్రమంలో ఈసారి లాభాలు ఖరారు అయితే లాభాల వాటా ముఖ్యమంత్రి ప్రకటించే అవకాశం ఉంది. గతేడాది 32శాతం కార్మికుల లాభాల వాటా ఉండగా, ఈసారి అది మరింత పెంచే అవకాశాలు ఉంటాయని కార్మికులు భావిస్తున్నారు.

వేగంగా ఇంటర్నల్ ఆడిట్..

- సింగరేణి సీఎండీ బలరాం స్వతహాగా ఫైనాన్స్ డైరెక్టర్.
- దీంతో లాభాల వాటాపై ప్రత్యేక దృష్టి సారించారు.

> **ఎన్నికల కోడ్ ముగిశాకే..**
>
> 
>
> సింగరేణిలో ఆడిట్ వేగంగా సాగుతోంది. ఇంటర్నల్ పనులు వేగంగా సాగుతున్నాయి. వచ్చే నెల 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. కోడ్ ముగిశాకే సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక అందజేస్తాం. ఆ తర్వాత ఆయన లాభాల వాటా ప్రకటించే అవకాశం ఉంది.
>
> – బలరాం, సింగరేణి సీఎండీ

- సాధ్యమైనంత త్వరగా లాభాల విషయం తేల్చే పనిలో ఉన్నారు. దీంతో సంబంధిత అధికారులు ఈ మేరకు కసరత్తు చేస్తున్నారు.
- సింగరేణి వార్షిక టర్నోవర్, లాభాలపై కసరత్తు వేగంగా సాగుతోంది.
- దీని కోసం ఇంటర్నల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు.
- స్టాట్యుటరీ ఆడిట్ ద్వారా వెరిఫై కూడా కొనసాగుతోంది.
- ఈసారి వార్షిక లాభాలు రూ.3వేల కోట్లకు పైగానే ఉంటాయని అంచనా వేస్తున్నారు.

ఈఏపీసెట్‌లో ప్రతిభ



శ్రీసాయిచంద్

జ్యోతినగర్(రామగుండం): జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలో మంచి ప్రతిభ చాటారు. శనివారం విడుదల చేసిన ఈఏపీ సెట్‌లో ర్యాంక్‌లు సాధించడంతో పలువురు అభినందించారు. ఎన్టీపీసీ కృష్ణానగర్‌కు చెందిన తొడుపునూరి నరేందర్–స్రవంతి దంపతుల కుమారుడు శ్రీసాయిచంద్ర ఈఏపీసెట్‌లో 3,243 ర్యాంక్ సాధించాడు. శ్రీసాయిచంద్ర హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తిచేశాడు.

ముర్మూర్ విద్యార్థి..



కమ్మల మేఘన

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామానికి చెందిన కమ్మల శశిధర్‌శర్మ–అనురాధ దంపతుల కూతురు మేఘన ఈఏపీసెట్‌లో 3,000 ర్యాంక్ సాధించింది. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఆమె ఇంటర్ పూర్తిచేసింది. ప్రతిభ చాటిన మేఘనను పలువురు అభినందించారు.

సుహాస్‌కు 1,670వ ర్యాంక్



సుహాస్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన రావి సుహాస్ 1,670 ర్యాంక్ సాధించాడు. అతడి తండ్రి సురేశ్ కరీంనగర్‌లోని ఓ మెడికల్ షాపులో గుమస్తాగా పనిచేశాడు. పదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి అరుణ ప్రైవేట్ టీచరుగా పనిచేస్తూ కుమారుడు సుహాస్, కూతురు సంజనను చదివిస్తోంది. తల్లి కష్టాన్ని అర్థం చేసుకుని ఇద్దరు పిల్లలు శ్రద్ధతో చదువుతున్నారు. సుహాస్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదివి 10 జీపీఏ సాధించాడు. హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ చదివి 976 మార్కులు పొందాడు. ఇటీవల ఇడుదలైన జేఈఈ మెయిన్‌లో 98.5 శాతం పర్సంటైల్ సాధించాడు. తను ఇస్రోలో సైంటిస్ట్ కావాలనేది లక్ష్యమని సుహాస్ తెలిపాడు.

అనన్యకు 1,093వ ర్యాంక్





అనన్య

గోదావరిఖనిటౌన్: స్థానిక చంద్రబాబుకాలనీకి చెందిన పెంచాల అనన్య 1,093వ ర్యాంక్ సాధించింది. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి, హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఆమె ఇంటర్ చదివింది.

అమ్మానాన్న ప్రోత్సాహం

మా అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే ఈఏపీసెట్‌లో 1,093 ర్యాంకు సాధించానని అనన్య తెలిపింది. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ఓబీసీ కేటగిరీలో 15వేల ర్యాంక్ సాధించినట్లు వివరించింది. తన తండ్రి రేడియం వర్క్‌షాపు నిర్వహిస్తూ తనను, తన తమ్ముడిని చదివిస్తున్నాడని తెలిపింది.

సీబీఎస్‌ఈ సిలబస్ అమలు చేయాలి

- సింగరేణి కార్మిక పిల్లలకు ఉన్నత విద్య అందించాలి
- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



వినతిపత్రం అందిస్తున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: తెలంగాణకు కొంగుబంగారంగా నిలుస్తున్న సింగరేణి ఉద్యోగుల పిల్లల కోసం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్) సిలబస్‌ను సంస్థ పాఠశాలల్లో ప్రవేశపెట్టాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో సంస్థ సీఎండీ బలరాంను శనివారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేటుస్థాయిలో అత్యున్నత స్థాయిలో విద్య అందించేలా చూడాలన్నారు. ఏటా రూ.వేల కోట్ల లాభాలు ఆర్జిస్తోందని అన్నారు. ఈక్రమంలో కొంతమొత్తాన్ని పాఠశాలల అభివృద్ధి కోసం కేటాయించాలని కోరారు. ఫీజుల పేరిట సింగరేణి కార్మికులను కార్పొరేట్ స్కూళ్లు దోపిడీ చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. క్రమశిక్షణ కలిగిన సెంట్రల్ సిలబస్ ద్వారా విద్యార్థులు మంచి నైపుణ్యత సాధించడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నాయకులు దాడి శ్రీధర్‌రెడ్డి, దుస్స భాస్కర్, బోడకుంట శ్రీధర్, పెద్దిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్నగిల్లుతున్న ఆత్మవిశ్వాసం

- అధికారుల సంఘం కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న అధికారుల సంఘం ప్రతినిధులు

గోదావరిఖని: కొందరి అనాలోచిత చర్యలతో ఆత్మవిశ్వాసం సన్నగిల్లి అధికారులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని సీఎంవోఏఐ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు పానుగోటి శ్రీనివాస్ అన్నారు. ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ ద్వారా సింగరేణి సీఎండీని ఉద్దేశించి శనివారం ఒక వినతిపత్రం అందజేశారు. గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి అధికారులు, ఉద్యోగులు సమష్టిగా శ్రమించి 70 మిలియన్ టన్నుల బొగ్గు లక్ష్యం సాధించారని తెలిపారు. ఇందులో భాగస్వాములైన అధికారులు, ఉద్యోగులను పేరుపేరునా అభినందించారని పేర్కొన్నారు. అంకితభావంతో పనిచేసేవారికి అండగా ఉంటానని మనోధైర్యం ఇచ్చారని గుర్తుచేశారు. కానీ పనిస్థలాల్లో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఆవేదన చెందారు. ప్రధానంగా సింగరేణి థర్మల్‌పవర్ ప్లాంట్ డీవైఎస్ఈ కిరీటి.. పనిఒత్తిడి, విజిలెన్స్ విచారణ పేరిట జరిగే వేధింపులతో మరణిస్తున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఈనెల 17న చనిపోయాడన్నారు. అధికారుల సంఘం తరఫున తాము దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. వసతులు లేకున్నా సంస్థ కోసం, అహర్నిశలు శ్రమిస్తున్న అధికారుల పరిస్థితిని అర్థం చేసుకోకుండా తీసుకునే అనాలోచిత చర్యలతో తమ ఆత్మవిశ్వాసం దెబ్బతింటోందని, ఇది బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై తీవ్రప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయంపై విచారణ జరిపించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలంగా విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్వోటూ జీఎం రాంమోహన్, ప్రతినిధులు మల్లేశం, పేరుమాళ్ల శ్రీనివాస్, మల్లేశ్, రావుల దామోదర్, అన్వేశ్, ఏజెంట్ చిలక శ్రీనివాస్, చంద్రశేఖర్, సాంబశివరావు, కట్ట శ్రీధర్, శ్రావణ్‌కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. అధికారి కిరీటి మృతికి కార్యాలయ అధికారులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

సీఎండీ స్పందించాలి

తమ సమస్యలపై సింగరేణి సీఎండీ తక్షణమే స్పందించాలని కోరుతూ ఆర్జీ–2 అధికారుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు ఆ ర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత కోసం పనిచేస్తున్న అధికారులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, ఈవిషయంలో మనోస్థైర్యం పెంపొందించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు మధుసూదన్, రాంరెడ్డి, నరేశ్, జనార్దన్, సుగుణాకర్, నితిన్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం కిరీటి ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు.



సెంటిమెంట్ టెంపుల్



మంథని: రాజకీయ నేతలకు సెంటిమెంట్ ఆలయంగా జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కన్నాల శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి తిరుకల్యాణం కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రాతినిధ్య వహించే ప్రజాప్రతినిధులు.. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో తొలుత స్వామివారిని దర్శించుకున్న అభ్యర్థికే విజయం సొంతమవుతుందని రాజకీయ నాయకుల విశ్వాసం. దీంతో ప్రతీ ఎన్నికలో స్వామివారి దర్శనం కోసం అభ్యర్థులు ఆరాటపడుతుంటారు.

నేటినుంచి ఉత్సవాలు..

ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. శనివారం స్వామివారికి అభిషేకం, కలశస్థాపన, దీపారాధన, అంకురార్పణ, దేవతా హవనం నిర్వహించడం ద్వారా వేడుకలు ప్రారంభించారు. ఈనెల 23వ తేదీన జరిగే రథోత్సవం, నాగెవల్లి కార్యక్రమాలతో స్వామివారి ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

స్ట్రాంగ్‌రూమ్‌లను నిరంతరం పర్యవేక్షించాలి

- రాష్ట్ర ఎన్నికల డిప్యూటీ ప్రధాన అధికారి మురళీమోహన్‌రావు ఆదేశం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మురళీమోహన్‌రావు

రామగిరి(మంథని): ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర ఎన్నికల డిప్యూటీ ప్రధాన అధికారి మురళీమోహన్‌రావు సూచించారు. సెంటనరీకాలనీలోని మంథని జేఎన్టీయూలో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌లను అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి శనివారం ఆయన తనిఖీ చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంథని, రామగుండం, పెద్దపల్లి, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌ల సీల్ పరిశీలించారు. జూన్ 4న చేపట్టే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు తీసుకుంటున్న చర్యలు, ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

కోనేరులో నీళ్లులేవు

- స్నానాలు చేసేదెలా?
- భక్తులకు తప్పని ఇబ్బందులు
- రూ.20 లక్షలు మట్టిపాలు
- స్పందించని ఓదెల మల్లన్న ఆలయ సిబ్బంది



చుక్కనీరు లేని ఓదెల మల్లన్న సన్నిధిలోని కోనేరు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల శ్రీమల్లికార్జునస్వామి కోనేటిలో నీళ్లలేక పుణ్యస్నానాల కోసం భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సమీపంలోని వాటర్ ట్యాంకులు లేదా వ్యవసాయ బావుల ఆధారంగా స్నానాలు చేసి వస్తున్నారు. మరోవైపు.. రూ.20 లక్షలు వెచ్చించి ఇటీవల నిర్మించిన కోనేటిలో నీళ్ల నింపేందుకు చర్యలు తీసుకోవడంలేదు.

భక్తుల కోసం కొత్త కోనేరు..

- ఓదెల మల్లికార్జునస్వామి దర్శనం కోసం ఉమ్మడి జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివస్తారు.
- తొలుత కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు.
- ఆ తర్వాతే స్వామివారి దర్శనం కోసం బయలుదేరి వెళ్తారు.
- అయితే, పాత కోనేటిలో నీళ్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతూ వచ్చారు.
- ఇటీవల రూ.20లక్షలు మంజూరు కావడంతో మల్లన్నస్వామి సన్నిధిలో అన్ని హంగులతో కోనేరు నిర్మించారు.
- కానీ, పంపింగు సిస్టం పనులు ఇంకా పూర్తికాలేదు.
- తాత్కాలికంగా ఓ విద్యుత్ మోటారు సాయంతో కోనేటిలో అప్పుడప్పుడు నీళ్లు నింపుతున్నారు.
- ప్రధానంగా స్వామివారి కల్యాణం, ఇతర వేడుకల్లోనే కోనేటిలో నీటి నిల్వలు ఉంటున్నాయి.
- అయితే, ఓదెల మల్లికార్జునస్వామి దర్శనం కోసం ప్రతీ ఆది, బుధవారాల్లో భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు.
- జాతర కూడా నిత్యం జోరుగా కొనసాగుతుంది.
- ఈ వేడుకలకు భక్తులు చాలామంది వస్తూపోతూ ఉంటారు.
- వీరు స్నానాలు ఆచరించడం ఇబ్బందిగా మారింది.

బావుల వద్ద స్నానం



ఓదెల మల్లన్న సన్నిధిలోని కోనేటిలో నీటిచుక్క లేదు. సుమారు 40ఏళ్లుగా ఏటా స్వామివారి దర్శనం కోసం వస్తున్నం. బావులకింద, వాటర్ ట్యాంకుల కింద స్నానం జేసుడైతంది. దేవుని కోనేరు కట్టి ఏం లాభం?

– పెంతం మల్లమ్మ, భక్తురాలు, ఆశన్నపల్లె

లేకుంటే ఎలా?



ఓదెల మల్లన్న దర్శనం కోసం ఏటా వస్తున్నం. కానీ, కోనేటిలో నీళ్లు ఉంటలెవ్వు. స్నానం జేశాకనే దేవున్ని దర్శనం చేసుకుంటం. సర్కారు కోనేరు కట్టించిందని సంబురపడ్డం. కానీ, నీటి చుక్కలేదు.

– అనవేన రాజయ్య, భక్తుడు, జూలపల్లి

పట్టించుకుంటలేరు



ఓదెల మల్లన్న దర్శనం కోసం 70ఏళ్ల నుంచి వస్తున్నం. ట్యాంకు కింద స్నానాలు చేసి మల్లన్నస్వామికి మొక్కులు పెట్టుకుంటున్నం. కోనేరు కట్టించిండ్రని సంబురపడ్డం. కానీ, అందులో నీళ్ల నింపడంలేదు.

– పెంచం మల్లమ్మ, భక్తురాలు, పరకాల

సిబ్బందికి చెబుతా



ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలోని కోనేటిలో నీరు నింపాలని సిబ్బందికి సూచిస్తాం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వరమే చర్యలు తీసుకుంటాం. ఆలయంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

– సదయ్య, ఈవో, ఓదెల మల్లన్న ఆలయం

ఈఏపీసెట్ ఫలితాల్లో 'అల్ఫోర్స్'కు అత్యున్నత ర్యాంకులు



అల్ఫోర్స్ ఎంసెట్ టాపర్స్‌తో అధినేత నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ(ఈఏపీసెట్)–2024 ఫలితాల్లో కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి అద్భుత ర్యాంకులతో అగ్రస్థానంలో నిలిచినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను బొకేలతో ఆయన సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వీఎస్ఆర్ మాట్లాడుతూ.. అల్ఫోర్స్‌కు చెందిన విద్యార్థులు వి.హాసిని 114వ ర్యాంకు, ఎన్.హేమంత్ 157, జి.శ్రీహాస్ 166, కె.సుప్రియ 296, ఎస్.జ్ఞానద 480, వి.శ్రీముఖి 568, ఎం.వర్షిత్ 575, జి.సాయిమంజునాథ్‌రెడ్డి 610, పి.జ్యోతిర్మయిరెడ్డి 863, శ్రీవెన్నెల 876, తేజస్విని 942, ఎ.శివవరుణ్ 973, సీహెచ్ అనూహ్య 950, పి.శ్రీనాథ్ 986, మలిహాఫాతిమా 992వ ర్యాంకు సాధించారన్నారు. 16 మంది విద్యార్థులు వెయ్యి లోపు ర్యాంకులు, 39 మంది 2వేల లోపు ర్యాంకులు, 63 మంది 3వేల లోపు ర్యాంకులు, 116 మంది 5వేల లోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్ కీర్తిప్రతిష్ఠలను దశదిశలా చాటడం గర్వంగా ఉందన్నారు. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమని ఈ ఫలితాలు తెలియజేస్తున్నాయని తెలిపారు. ఇటీవల ప్రకటించబడిన ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో అల్ఫోర్స్ చారిత్రాత్మక విజయం సాధించిందని, 450 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని చెప్పారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషి ఫలితంగా అల్ఫోర్స్ ఘనవిజయాలు సాధిస్తోందని పేర్కొన్నారు. రాబోయే ఐఐటీ అడ్వాన్స్, నీట్ ఫలితాల్లో మహోన్నత ర్యాంకులతో ముందంజలో ఉంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ట్రినిటి' అద్భుత ఫలితాలు



విద్యార్థులను అభినందిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఈఏపీసెట్ 2024 ఫలితాల్లో ట్రినిటి జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కళాశాలల ఫౌండర్ చైర్మన్, పెద్దపల్లి మాజీ శాసన సభ్యుడు దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన జె.హనికర్ అత్యుత్తమంగా 44వ ర్యాంక్ సాధించి సత్తా చాటినట్లు పేర్కొన్నారు. పి.ప్రణయ్ 773, వై.ఆశ్లేష 1254, వి.శ్రీతేజ 1255, వై.అశ్విత 1551, సీహెచ్ విఘ్నేశ్ 1624, అయేషా 1627, ఫిల్జా అతీక్ 1748, ఎస్.శ్రీలక్ష్మీ 2159, ఎం.హర్షవర్ధన్ 2280, ఎన్.గంగశ్రీ 2372, పి.శ్రీదీప 2682, సీహెచ్ రంజిత 2815, మదిహా ఫాతిమా 2913, ఎం.ఆశీష్ 2954, కె.రాణి 2998 ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. 10వేల లోపు ర్యాంకులను చాలామంది విద్యార్థులు కైవసం చేసుకున్నారన్నారు. అత్యుత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను శనివారం ఆయన అభినందించారు. విద్యార్థులను కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తోపాటు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

'ఎస్ఆర్' విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న నేదూరి తిరుపతి

తిమ్మాపూర్: రాష్ట్రంలో ఇంజినీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈఏపీసెట్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో కరీంనగర్ జిల్లా ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కరీంనగర్ ఎస్సార్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి తెలిపారు. తమ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివిన తుమ్మ తేజస్వి 161 ర్యాంకు, ముంకల గణేశ్ 199, కటంకూరి శ్రీనివాసరెడ్డి 291, రావుల దీపాన్షురెడ్డి 412, గడ్డం రాజీవ్ 552, సాయిచంద్ర 565తోపాటు మరో 12 మంది వెయ్యి లోపు ర్యాంకులు, మరో 20 మంది 5వేల లోపు ర్యాంకులు సాధించారని వివరించారు. అగ్రికల్చర్‌లో మధులికరెడ్డి, లక్ష్మీప్రసన్న, అశ్విత రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించారని తెలిపారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్ మధూకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి తిరుపతి, అకాడమిక్ డీన్ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు నాగార్జునరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మారుతి, శ్రీనివాసరెడ్డి అభినందించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని కొండాపూర్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం విచారణ చేపట్టారు. కొండాపూర్‌కు చెందిన గౌరి కన్నయ్య తనను ఇదే గ్రామానికి చెందిన తుపాకుల శ్రీనివాస్‌గౌడ్ కులం పేరుతో దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, సాక్షుల వాంగ్మూలం తీసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సై శేఖర్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జగిత్యాలక్రైం: పట్టణ శివారులోని టీఆర్‌నగర్‌కు చెందిన ఎస్కే సపోల్(22) అనే యువకుడు శుక్రవారం అర్ధరాత్రి కొత్త బస్టాండ్ అవుట్‌గేట్ ప్రాంతంలో ద్విచక్ర వాహనం డివైడర్‌కు ఢీకొని మృతిచెందాడు. టీఆర్‌నగర్‌కు చెందిన జగన్నాథం విజయ్, ఎస్కే సపోల్ శుక్రవారం రాత్రి పని నిమిత్తం జగిత్యాలకు వచ్చారు. అర్ధరాత్రి 1.40 గంటల ప్రాంతంలో కొత్త బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద ద్విచక్ర వాహనం అతివేగంగా వెళ్లి డివైడర్‌ను ఢీకొనగా.. ఎస్కే సపోల్ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఎస్కే జలీల్ ఫిర్యాదు మేరకు ద్విచక్ర వాహనం నడుపుతున్న జగన్నాథం విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై నరేశ్ తెలిపారు.

ఇసుక లారీ, ఆర్టీసీ బస్సు ఢీ


ఢీకొన్న ఆర్టీసీ బస్సు, ఇసుక లారీ

ముత్తారం(మంథని): ఖమ్మంపల్లి గ్రామంలో శనివారం ఇసుక లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ఇరుకైన రోడ్డు కావడం, కొన్ని లారీలను రహదారిపైనే పార్కింగ్ చేయడంతో మిగతా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈక్రమంలోనే లారీ, బస్సు ఢీకొన్నాయని గ్రామస్తులు తెలిపారు. అయితే, ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

డీజిల్ కుంభకోణంపై రీజినల్ డైరెక్టర్ విచారణ


వేములవాడ: వేములవాడ మున్సిపాలిటీలో 2022లో డీజిల్ కుంభకోణానికి పాల్పడిన అప్పటి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నగేశ్‌పై మున్సిపల్‌శాఖ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ శనివారం విచారణ చేపట్టారు. డీజిల్ కుంభకోణానికి పాల్పడిన నగేశ్‌ను ఆ సమయంలో కలెక్టర్ సస్పెండ్ చేశారు. అయితే శాఖాపరమైన చర్యల్లో భాగంగా రీజినల్ డైరెక్టర్ విచారణకు వచ్చారు.

ఉమ్మడి జిల్లా.. పర్యాటక ఖిల్లా

ఎన్నో చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు..

- భక్తులు, పర్యాటకులను ఆకర్షిస్తున్న వైనం
- చూసొద్దాం.. రండి

కరీంనగర్: ఒకప్పుడు కల్లోల ప్రాంతాలతో ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేడు పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. దేశంలోనే పేరెన్నిక గన్న సిల్వర్ ఫిలిగ్రీతోపాటు నాణ్యమైన నల్ల బంగారు గనులకు ప్రసిద్ధి పొందింది. ఎన్నో చారిత్రక స్థలాలు, కట్టడాలు, ఆధ్యాత్మికతను పరిమళింపజేసే ఆలయాలు ఆకర్షిస్తున్నాయి. దర్శించుకోవాలంటూ పర్యాటకులు, భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. వాటిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



కొండల మధ్య రాముని గుండాలు

రామగుండం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో కొండల మధ్య ముచ్చగొలిపే చారిత్రక ప్రాంతం రాముని గుండాలు. కొండపైకి ఎక్కి చూస్తే కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలను కలిపే గోదావరినది, బొగ్గు గనులు, విద్యుత్ కేంద్రం కనువిందు చేస్తాయి.



నాలుగు నూర్ల దేవాలయాలు.. నగునూరు

కరీంనగర్ జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగునూరులో పూర్వం చాళుక్యులు, కాకతీయుల సామంతరాజులు 4 గుట్టలను కలుపుతూ కోటను నిర్మించి, పరిపాలన సాగించారు. బౌద్ధుల కాలం నాటి శాసనాలు, విగ్రహాలు, స్మారక చిహ్నాలు ఉన్నాయి. గంగాధరుడు నిర్మించిన త్రికూటాలయం నాటి శిల్పకళా ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. ఒకప్పుడు 400 దేవాలయాలు ఉండేవని, నాలుగు నూర్ల దేవాలయాలు ఉన్న ఊరు కాస్త నగునూరుగా స్థిరపడిందని చరిత్ర చెబుతోంది. గ్రామం వెలుపల అతిసుందరమైన పెద్ద నాగశిల్పం ఉంది. హైదరాబాద్‌కు చెందిన కాసుగంటి నారాయణరావు ట్రస్టు ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో పురాతన ఆలయాల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి.

దక్షిణకాశీ.. వేములవాడ

కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఆదాయంలో తిరుపతి తర్వాత రెండోది. దక్షిణకాశీగా కీర్తిగాంచిన ఈ ఆలయాన్ని కళ్యాణి చాళుక్య వంశీయుడైన ఆరో విక్రమాదిత్యుడు వెయ్యేళ్ల క్రితం నిర్మించాడని శాసనాలు చెబుతున్నాయి. కోడె మొక్కు ఆచారం ఇక్కడ తప్ప రాష్ట్రంలో మరెక్కడా లేదు. మతసామరస్యానికి ప్రతీకగా దర్గాతోపాటు జైన దేవాలయాలు ఇక్కడ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

కోర్కెలు తీర్చే అంజన్న.. కొండగట్టు

మల్యాల మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు. కరీంనగర్‌కు 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. 300 ఏళ్ల కింద ఈ ఆలయం నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఇప్పుడున్న గుడి మాత్రం 160 ఏళ్ల కింద కృష్ణారావు దేశ్‌ముఖ్ నిర్మించారు. భక్తుల కోర్కెలు తీర్చే దేవునిగా ఆంజనేయస్వామి పేరు పొందారు. కొండల రాయుని కోట, గుహలు, బొజ్జ పోతన, సీతమ్మవారి కన్నీటి గుంటలు చూడదగినవి.

సైఫన్.. నాగులపేట



కోరుట్లకు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగులపేట సైఫన్ ఆసియా ఖండంలోనే అరుదైన నిర్మాణంగా కీర్తిగాంచింది. భూగర్భంలోకి కాలువలోని నీరు మాయమై, వాగు దాటాక తిరిగి ప్రత్యక్షమవుతుంది. కింద కాలువ, పైన వాగు ఉండటం ఈ సైఫన్ ప్రత్యేకత.

వందేళ్ల నాటి ఎలగందుల ఖిల్లా

కాకతీయులు, బహమనీలు, కుతుబ్‌షాహీలు, మొగలులు, అసఫ్‌జాహీలకు రాజధానిగా విలసిల్లిన ఎలగందుల కరీంనగర్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడి కోట కొండపై మసీదు ఉంది. దాని మీనార్ ఒకటి కదిపితే కదులుతుందని అంటారు. లోపల బంగారు రంగు చిత్రాలు చూపరులను ఆకర్షిస్తాయి.

బౌద్ధ స్తూపం.. ధూళికట్ట

ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామం కరీంనగర్‌కు 28 కిలోమీటర్ల దూరంలో ఉంది. 1975 నుంచి 77 వరకు జరిపిన తవ్వకాల్లో నాటి కోట, బౌద్ధ స్తూపం బయటపడ్డాయి. కోట ముఖద్వారం వద్ద రాగి నాణేలు, మట్టి బొమ్మలు దొరికాయి.

శాతవాహనుల రాజధాని.. కోటిలింగాల

శాతవాహనుల రాజధాని కోటిలింగాల. వెల్గటూర్ మండలానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో ఎక్కడ చూసినా శివలింగాలు, శిల్పకళా ఖండాలు, ఖండాల ఖండికలు కనిపిస్తుంటాయి. పురావస్తు శాఖవారు జరిపిన తవ్వకాల్లో శాతవాహనుల హయాంలోని నాణేలు, ఇతర స్మారక చిహ్నాలు వెలుగుచూశాయి. ఇక్కడి గోదావరినది నడి ఒడ్డున శ్రీకోటేశ్వరస్వామి ఆలయం ఉంది.

త్రివేణి సంగమ క్షేత్రం.. కాళేశ్వరం



కరీంనగర్‌కు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాళేశ్వరం.. శ్రీశైలం, ద్రాక్షారామం అంతటి విశిష్టమైంది. గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు సంగమించే చోటిది. ప్రధాన ఆలయంలో కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి లింగాలు ఒకే పానవట్టంపై ఉండటం విశేషం. ఇక్కడి లింగంపైన గల నాసికలో ద్రవం పోస్తే త్రివేణి సంగమంలో కలుస్తుందని ప్రతీతి. ప్రధాన ఆలయానికి కిలోమీటర్ దూరంలో ముక్తీశ్వరాలయం ఉంది. దీని చుట్టూ ఉన్న చిన్నచిన్న రాళ్లలో నుంచి విభూది రాలడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

నృసింహుని క్షేత్రం.. ధర్మపురి

కరీంనగర్‌కు ఉత్తరాన 70 కిలోమీటర్ల దూరంలో ధర్మపురి నృసింహుని క్షేత్రం ఉంది. అర్ధాయుష్కు డైన కుమారుడి కోసం బలివర్మ మహారాజు దేవతాయాగం చేసి, విజయం సాధించడం, ప్రజలు ధర్మబద్ధంగా జీవించడం కారణంగా ధర్మపురిగా వాసికెక్కింది. పద్మాసనంలో లక్ష్మీ సమేతుడై వెలసిన నరసింహస్వామితోపాటు, రామలింగేశ్వరాలయం పక్కపక్కనే ఉండి శైవ, వైష్ణవ సమ్మేళనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

వీరభద్రస్వామి.. కొత్తకొండ

భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ మీసాల వీరభద్రస్వామి దేవస్థానం అతి పురాతనమైంది. కాకతీయ రుద్రేశ్వరుని కాలం క్రీ.శ. 1410లో మల్లికార్జున పండితుని మనవడైన కేదారిచే ఆలయ నిర్మాణం జరిగింది. ఏటా సంక్రాంతికి జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.



రాజ భవనాలు.. రామగిరి ఖిల్లా

పెద్దపల్లికి 20 కిలోమీటర్ల దూరంలో గోదావరినదీ తీరాన శత్రుదుర్భేద్యమైన రామగిరి ఖిల్లా ఉంది. ఇక్కడి కోటలో సీతారామలక్ష్మణులు కొంతకాలం నివసించి చాతుర్మస్య వ్రతం ఆచరించినట్లు స్థానికులు చెప్పుకుంటారు. కోట లోపల గల అనేక రాజ భవనాలు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. ఇక్కడి ప్రకృతి సౌందర్యానికి ఆకర్షితుడైన ఔరంగజేబు దీన్ని ఆరామ్ గిరి అని పిలిచారంటారు.

మరికొన్ని ఆలయాలు..

సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామంలో దుబ్బ రాజేశ్వరస్వామి, ఓదెల మల్లికార్జునస్వామి, ఇల్లంతకుంట మండలంలోని జంగంపల్లి శ్రీరామలింగేశ్వర స్వామి, గంగాధర మండలంలోని నందగిరి లక్ష్మీనర్సింహస్వామి, రాయికల్‌లోని కేశవనాథ పంచముఖ లింగేశ్వర త్రికూట ఆలయాలు, కోరుట్ల మండలంలోని నాగులపేట సైఫన్, మొలంగూరు ఖిల్లా సందర్శించదగినవి.

సైనిక స్థావరం.. జగిత్యాల ఖిల్లా

కరీంనగర్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న జగిత్యాల ఖిల్లాను జాఫరుద్దౌలా హయాంలో ఫ్రెంచ్ ఇంజినీర్లు నిర్మించారు. 20 ఎకరాల విస్తీర్ణంలో పూర్తిగా రాతితో నిర్మించిన ఈ ఖిల్లా నాడు సైనిక స్థావరంగా ఉండేది. ఇప్పటికీ చెక్కు చెదరకుండా చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది.


పురావస్తు ప్రదర్శన శాల

కరీంనగర్ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న పురావస్తు ప్రదర్శన శాలను 1964లో నెలకొల్పి, 1984లో ఆధునీకరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తవ్వకాల్లో వెలుగుచూసిన శాతవాహనులు, కాకతీయులు, అసఫ్‌జాహీల చిహ్నాలు, నాణేలు, స్టాంపులు, యుద్ధ సామగ్రి, పుణ్యక్షేత్రాల అవశేషాలను ఇక్కడ ఉంచారు.

మంత్రపురి.. మంథని

అనాదిగా వైదిక సంస్కృతి వైభవాన్ని పరిరక్షిస్తున్న మంత్రపురి ప్రస్తుతం మంథనిగా పిలువబడుతోంది. కరీంనగర్‌కు 70 కిలోమీటర్ల దూరంలో గోదా వరి నదీతీరాన వెలసిన గౌతమేశ్వరాలయంలోని బ్రాహ్మణోత్తములు వేదాధ్యయనంలో మేటిగా నిలిచారు. అప్పట్లో మంథనికి వాస్తు అక్కరలేకుండా నాలుగు దిక్కులా 4 శివలింగాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతం వాటిని దాటి, విస్తరించింది.

రామాలయం.. ఇల్లందకుంట



హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని ఇల్లందకుంట మండల కేంద్రంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఉంది. దండకారణ్యంలో వవవాసం చేస్తున్న సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రుడు ఈ ప్రాంతానికి చేరుకున్నారని, దశరథుని మరణవార్త తెలిసి ఇల్లంద గింజలతో తర్పణం వదిలారని ప్రతీతి. నల్ల గొండ జిల్లాకు చెందిన రాఘవరెడ్డి ఈ దేవాలయాన్ని నిర్మించారని చరిత్ర చెబుతోంది.

గోపులాపూర్ మృతులకు కన్నీటి వీడ్కోలు

- హాజరైన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గ్రామస్తులు
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు, బంధువులు


శ్రీనివాస్, మహేశ్ మృతదేహాలకు నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

బుగ్గారం(ధర్మపురి): మండలంలోని గోపులాపూర్‌లో ఇంటి కొనుగోలు విషయంలో ఏర్పడిన వివాదం వరుసకు అన్నాతమ్ముడైన దీటి మహేశ్, శ్రీనివాస్‌ల హత్యకు దారితీయగా మృతులకు శనివారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. గురువారం రాత్రి సంఘటన జరిగినప్పటి నుంచి అంత్యక్రియలు పూర్తయ్యేవరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో బుగ్గారం, గొల్లపల్లి, వెల్గటూర్ ఎస్సైలు శ్రీధర్‌రెడ్డి, ఉమాసాగర్, సతీశ్‌ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వందలాది మంది గ్రామస్తులు, పలువురు ప్రజాప్రతినిధులు మృతులకు కన్నీటి వీడ్కోలు పలికారు. హత్యకు రెండు రోజుల ముందే మహేశ్ ముంబయి నుంచి రాగా.. చావు కోసమే వచ్చినవా బిడ్డా.. అంటూ కుటుంబసభ్యులు, బంధువులు రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

ప్రభుత్వపరంగా ఆదుకుంటాం : విప్ అడ్లూరి

అత్యంత దారుణంగా జరిగిన ఈ హత్యలు తనను తీవ్రంగా కలచివేశాయని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అంత్యక్రియలకు హాజరైన ఆయన మృతులకు నివాళి అర్పించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దోషులెంత మంది ఉన్నా తప్పించుకోలేరని, చట్టపరంగా చర్యలు తీసుకునేలా చూస్తామని పేర్కొన్నారు. చిన్న చిన్న తగాదాలకే ఇంత దారుణంగా ప్రవర్తించడం సమాజానికి మంచిది కాదన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన రూ.20 వేలు, జెడ్పీటీసీ సభ్యుడు బాదినేని రాజేందర్ రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, నాయకులు నర్సాగౌడ్, బీర్పూరి తిరుపతి, మదన్, సంతోష్ తదితరులున్నారు.

8 నుంచి జిల్లాస్థాయి శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న రమేశ్

వేములవాడ: సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు వేములవాడలో జూన్ 8 నుంచి 10 వరకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముష్కం రమేశ్ తెలిపారు. వేములవాడలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి ఎంపిక చేసిన 100 మంది ముఖ్య నాయకులకు రాష్ట్ర పార్టీ నాయకులు శిక్షణనిస్తున్నట్లు చెప్పారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎరవెల్లి నాగరాజు, ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, మల్లారపు ప్రశాంత్, గురిజాల శ్రీధర్, నాయకులు గణేష్, అశోక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

బొలెరో ఢీకొని వ్యక్తి దుర్మరణం

హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట(హుజూరాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన మండల సమ్మయ్య(60) శనివారం పని నిమిత్తం సైకిల్‌పై శాలపల్లి ఇందిరానగర్ వెళ్లాడు. తిరిగి వస్తుండగా జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సమ్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు.

వాహన యజమాని ఇంటి ఎదుట ధర్నా

సమ్మయ్యను ఢీకొన్న వాహనం జమ్మికుంట పట్టణంలోని ఓ ఐరన్ షాపు యాజమానికి చెందినది. దీంతో మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో అతని ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. కానీ, యజమాని అప్పటికే తన కుటుంబసభ్యులతో కలిసి తిరుపతి వెళ్లాడు. ప్రమాద విషయం తెలిశాక బాధితులతో ఫోన్‌లో మాట్లాడాడు. పరిహారం ఇచ్చేందుకు ఒప్పందం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. మృతుడికి భార్య యాదక్క, నలుగురు కుమారులు ఉన్నారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుజూరాబాద్ టౌన్ సీఐ రమేశ్, జమ్మికుంట ఎస్సై రాజేశ్, ఇల్లందకుంట ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అడవి పందిని చంపిన వ్యక్తి పట్టివేత


నిందితుడిని చూపుతున్న పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): అడవి పందిని చంపిన ఓ వ్యక్తిని పట్టుకున్నట్లు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. అల్లూరు గ్రామానికి చెందిన ఆవుల రాజేశ్ శనివారం అడవి పందిని చంపాడు. సంచిలో వేసుకొని, బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో యైటింక్లయిన్‌కాలనీలోని ఎస్ఎంఎస్ ప్లాంట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి, బైక్‌ను వెనక్కి తిప్పాడు. దీంతో వారు అతన్ని వెంబడించి పట్టుకున్నారు. సంచిలో చూడగా అడవి పంది కళేబరం కనిపించింది. విచారణ నిమిత్తం రాజేశ్‌ను మంథని ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు టూటౌన్ సీఐ రవీందర్ పేర్కొన్నారు.

అప్పు తీర్చలేనని ఐపీ నోటీసులు

మెట్‌పల్లి: ఇతరుల వద్ద తాను తీసుకున్న అప్పులను తీర్చలేనని ఓ వ్యాపారి పలువురికి ఐపీ నోటీసులు పంపడం మెట్‌పల్లి పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కొన్నేళ్లుగా బంగారు ఆభరణాల దుకాణం నిర్వహిస్తూ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపార అవసరాల నిమిత్తం ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌తోపాటు మరో 27 మంది వద్ద అప్పు తీసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో వ్యాపారంలో దివాలా తీశాననే కారణంతో పలువురికి ఐపీ నోటీసులు పంపించారు. ఇందులో కొందరు నగదు అప్పు ఇవ్వగా, మిగతా కొందరు బంగారం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.